క్లుప్తంగా

హోం ఓటింగ్ ప్రారంభం

జడ్చర్ల టౌన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శనివారం నుంచి జడ్చర్ల పరిధిలో హోం ఓటింగ్ ప్రారంభం అయ్యింది. నియోజకవర్గంలో మొత్తం 82 మంది హోం ఓటర్లు ఉన్నారు. 43మంది దివ్యాంగులు, 39మంది సీనియర్ సిటిజన్స్ ఉన్నారు. హోం ఓటర్లకోసం రెండు బృందాలను నియమించినట్లు నోడల్ అధికారి, నవాబుపేట తహసీల్దార్ నాన్యనాయక్ వెల్లడించారు. నియమించిన బృందాలు మొదటి రోజున మిడ్జిల్, ఊరుకొండపేట మండలాల్లో ఒక బృందం, మరో బృందం బాలానగర్, రాజాపూర్ మండలాల్లో హోం ఓటర్ల వద్దకు వెళ్లి ఓట్లు వేయించారు. పై నాలుగు మండలాల్లో మొత్తం 40మంది హోం ఓటర్లు ఉన్నారు. ఆదివారం జడ్చర్ల మండలంలోని 29మంది హోం ఓటర్లతో ఓట్లు వేయించనున్నారు. సోమవారం నవాబుపేట మండలంలో ఉన్న 13మందితో ఓట్లు వేయించనున్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



బాలానగర్: ఉడిత్యాల పరిధిలోని మామిడిగుట్ట తండాలోని వీరాంజనేయ స్వామి ఆలయం ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణం జరిగి సంవత్సరం పూర్తయిన నేపథ్యంలో కార్యక్రమం చేపట్టారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటచారి, ఎంపీటీసీ అభిమన్యురెడ్డి పాల్గొన్నారు.

కళలకు ప్రభుత్వ ప్రోత్సాహం

కోయిల్‌కొండ: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే వీధి నాటకం, ఇతర కళలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్త కుంభం శివకుమార్‌రెడ్డి అన్నారు. కొత్లాబాద్‌లో నిర్వహించిన వీరబ్రహ్మేంద్రస్వామివారి జీవిత చరిత్ర వీధినాటకానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండల అధ్యక్షుడు జి.రవీందర్, బ్లాక్ అధ్యక్షుడు వై.విద్యాసాగర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

‘పాలమూరుకు ఐఐటీ, నీట్ తెస్తా’

పాలమూరు: దేశ భవిష్యత్ కోసం విద్యావంతులు, విద్యార్థులు ఆలోచించి ఓటు వేయాలని మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న జిల్లా గ్రంథాలయం, బీసీ, ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత పాలమూరుకు ఐఐటీ, నీట్ వంటి విద్య సంస్థలను తీసుకొస్తానని, నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు.

రోడ్‌షోకు తరలిన నాయకులు

దేవరకద్ర: కొత్తకోటలో శనివారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి రోడ్ షోలో పాల్గొనేందుకు మండల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి, కౌకుంట్ల నుంచి వాహనాలు భారీగా వెళ్లాయి.

భూత్పూర్: మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శనివారం కొత్తకోటకు భారీసంఖ్యలో తరలివెళ్లారు. జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు.

బోల్తాపడిన బొలెరో: నలుగురికి గాయాలు

- మామిడికాయలు కోసేందుకు వెళ్తుండగా ఘటన

నవాబుపేట: బొలెరో బోల్తాపడి నలుగురు స్వల్పంగా గాయపడిన ఘటన లోకిరేవు సమీపంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. గ్రామం నుంచి మామిడి కాయలు కోసేందుకు కూలీలు శనివారం బొలెరోలో బయలుదేరారు. ఈ క్రమంలో వాహనం రేకుల చౌడాపూర్ మలుపు వద్ద బోల్తాపడింది. నలుగురికి స్వల్పగాయాలు కాగా డ్రైవర్ పరారయ్యాడు. కాగా గ్రామస్తులు గాయపడ్డ వారిని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

గృహ నిర్మాణాలకు ఇసుక కొరత



ఇసుక కొరతతో హన్వాడలో నిలిచిన గృహనిర్మాణం

- నత్తనడకన పనులు
- ఇదే అదనుగా దళారుల దందా
- పట్టించుకోని అధికారులు

హన్వాడ: మండలంలో ఇసుక కొరత కారణంగా గృహనిర్మాణాలు నత్తనడక సాగుతున్నాయి. ఇసుక కొరత ఇళ్ల నిర్మాణాలను చేపట్టిన వారికి ప్రధాన సమస్యగా మారింది. దీన్ని గుర్తించిన దళారులు ఇసుకను అధిక ధరలకు విక్రయిస్తూ దండుకుంటున్నారు. పలువురు ఇసుక వ్యాపారులు గృహనిర్మాణాల పేరిట ఒక్క ట్రాక్టర్‌కు అనుమతి పొంది దాని మాటున ఏకంగా 10–20 ట్రిప్పుల వరకు వాగులను తోడేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ‘ఇసుక ఫ్రీ’ ప్రకటనతో మరింత రెచ్చిపోయి రేయింబవళ్లు ఇసుక రవాణా చేస్తుండడంతో.. మూడు పువ్వులు, ఆరుకాయలుగా వారి అక్రమ వ్యాపారం వర్ధిల్లుతోంది. గతంలో స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుతో పోలీసులు పలుమార్లు కేసులు నమోదు చేసినా ఎక్కడా తగ్గేదేలే.. అన్నచందంగా విజృంభిస్తున్నారు.

మళ్లీ ప్రారంభమైన ఫిల్టర్ ఇసుక...

వాగుల్లో ఆశించినంత ఇసుక లేకపోవడంతో అక్రమ వ్యాపారులు మళ్లీ తమ దందాను పునరావృతం చేశారు. బుద్ధారం, కారంతండా, గుడ్డిమల్కాపూర్, ఇబ్రహీంబాద్, పుల్పోనిపల్లి, చిన్నదర్పల్లి, ఇబ్రహీంబాద్ పరిసర ప్రాంతాల్లో ఫిల్టర్ ఇసుక వ్యాపారం జోరందుకుంది. మట్టిని తోడి ఇసుకను తయారు చేసి ఒక్కో ట్రిప్పు రూ.3–4వేల వరకు విక్రయిస్తున్నారు. కాగా ఇళ్ల నిర్మాణదారులకు వేరేదారి లేక వారిని ఆశ్రయిస్తున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో అక్రమ దందాకు అడ్డకట్ట వేయాలని.. అదేవిధంగా గృహనిర్మాణదారులకు ఇసుక కొరత తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుని.. అధికారులు సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



టంకరలో అర్ధరాత్రి ఇసుక రవాణా

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి..



ఇంటి నిర్మాణం చేపట్టి దాదాపు నెల రోజులు కావస్తోంది. ఇసుక కోసం ఎవ్వరిని సంప్రదించినా దొరకడం లేదు. అధిక డబ్బులు అడుతున్నారు. గృహనిర్మాణానికి ఇసుక తప్పనిసరి కావడంతో ఇబ్బందులు పడుతున్నా. కొంతమంది టిప్పర్ రూ.25వేలు అంటున్నారు. ఇలాంటి పరిస్థితిలో ఇంటి నిర్మాణం పూర్తిచేయడం కష్టంగా మారేలా ఉంది. ప్రభుత్వం ఇసుక సరఫరాకు చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

– కె.శ్రీనివాసులు, హన్వాడ

విచ్చలవిడిగా అక్రమ రవాణా..



రేయింబవళ్లు ఇసుక వ్యాపారం జోరుగా సాగుతోంది. పట్టించుకునే నాథుడే లేడు. స్థానిక నిర్మించుకునే వారికి ఇసుకను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇతర ప్రాంతాలకు సైతం రేయింబవళ్లు ఇసుక రవాణా చేస్తూ వాగులను ఖాళీ చేస్తున్నారు. దీంతో పరిసర ప్రాంతాల్లోని బోర్లలో నీటిమట్టాలు తగ్గిపోయాయి. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– భూపతిరెడ్డి, వేపూర్

కఠిన చర్యలు తప్పవు..



గతంలో ఫిల్టర్ ఇసుక తయారీ కేంద్రాలను జేసీబీలతో ధ్వంసం చేశాం. తయారీదారులకు కఠినమైన ఆదేశాలిచ్చాం. అయినా మళ్లీ అదే చర్యకు పాల్పడితే చట్ట ప్రకారం కఠినచర్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. గృహనిర్మాణాలు చేపట్టే వారు ఇసుక కోసం సంప్రదిస్తే అందించే విధంగా చర్యలు తీసుకుంటాం.

– కిష్టానాయక్, తహసీల్దార్, హన్వాడ

మరోసారి మోదీనే ప్రధాని



బీజేపీ అభ్యర్థి డీకే అరుణ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు

పాలమూరు: బీజేపీ అభ్యర్థి డీకే అరుణ జన్మదిన వేడుకలను శనివారం ఆమె నివాసంలో ఘనంగా నిర్వహించారు. భారీ కేక్‌ను కట్ చేయించారు. రేణుక ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేశారు. రెడ్ క్రాస్ అనాథ శరణాలయంలో పండ్లు పంపిణీ చేశారు. టచ్ శరణాలయంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేయించారు. దుప్పట్లు, పండ్లు అందజేశారు. జిల్లా కార్యాలయంలో అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుక నిర్వహించారు.

నవాబుపేట: దేశం మొత్తం మోదీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావాలని కోరుకుంటుందని.. మరోసారి ఆయన ప్రధాని కావడం ఖాయమని ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. శనివారం మండలానికి చెందిన పలు గ్రామాల కార్యకర్తలు ఆమె నివాసంలో పార్టీలో చేరిన సందర్భంగా మాట్లాడారు. కాకర్లపహాడ్ మాజీ ఉపసర్పంచ్ నరేందర్, బాలస్వామి, , శ్రీనివాస్‌చారి, పాశం నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాల పరిరక్షణకు కృషి



ప్రసంగిస్తున్న కమిషనర్ రాజయ్య

జడ్చర్ల టౌన్: సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో ఆర్యసమాజం నిర్వహిస్తున్న దయానంద విద్యామందిరాలు ముందున్నాయని జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ ఎస్. రాజయ్య అన్నారు. పట్టణంలోని దయానంద విద్యామందిరంలో ఏడు రోజులుగా నిర్వహిస్తున్న యువశక్తి నిర్మాణ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వేసవి సెలవుల్లో బాల బాలికలకు సూర్య నమస్కారాలు, కర్రసాము, భజనలు, గేయాలలో ప్రావీణ్యం కల్పించటంతోపాటు నిత్యం హోమం చేయటం బాగుందని ప్రశంసించారు. బాల బాలికల్లో ఆధ్యాత్మికత కలిగేందుకు ఇవి దోహదపడ్తాయన్నారు. శిబిరం ముగింపులో భాగంగా బాల బాలికలకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు షీల్డులు బహూకరించారు. కార్యక్రమంలో వేద విద్వాంసులు ఆచార్యవేది సింధు, ఆర్యసమాజ సభ్యులు ప్రభాకర్, నర్సయ్య, శ్రీనివాసచారి, గుబ్బ నర్సింహులు, రాజేశ్వర్, ఉమ్మెంతల మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలను నమ్మవద్దు



గూరకొండలో ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర: కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మరోసారి మోసపోవద్దని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శనివారం బస్వాయపల్లి, గోపన్‌పల్లి, గూరకొండ తదితర గ్రామాల్లో ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. హామీలు అమలు చేయకుండా ఓట్ల కోసం వస్తున్న కాంగ్రెస్ వారిని నిలదీయాలన్నారు. ఇక మతం పేరుతో బీజేపీ ప్రజల మధ్య విబేధాలను సృష్టించి ఓట్లను దండుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. ఎన్నికల్లో వారికి తగిన బుద్ధి చెప్పాలని.. బీఆర్‌ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మండల అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి, మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్ పాల్గొన్నారు.

కరాటే అభివృద్ధికి కృషిచేయాలి



బ్లాక్‌బెల్టులు పొందిన వారితో సినీహీరో సుమన్

జడ్చర్ల టౌన్: వీఐపీ బ్లాక్‌బెల్ట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జడ్చర్లకు చెందిన 12మందికి సినీహీరో సుమన్ బ్లాక్‌బెల్టులు ప్రదానం చేశారు. హైదరాబాద్ త్యాగరాయ గానసభ వద్ద జరిగిన కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. బెల్టులు పొందిన వారిని అభినందించారు. ప్రతి మాస్టర్ వందమంది మాస్టర్లను తయారు చేయాలని తద్వారా దేశంలో కరాటే అభివృద్ధి జరుగుతుందన్నారు. కరోనా కారణంగా ప్రతి ఒక్కరి శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గిపోయిందని, మార్షల్ ఆర్ట్స్ వల్ల శక్తి తిరిగి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సీనియర్ మాస్టర్లు ఇలియాస్, జీకే మాస్టర్ షోటోఖాన్ కరాటేడూ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మాస్టర్ అశ్వక్ తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: జీకే మాస్టర్ షోటోకాన్ ఆధ్వర్యంలో కరాటేలో శిక్షణ పొందిన మిడ్జిల్ విద్యార్థులకు శనివారం హైదరాబాద్‌లో సినీహీరో సుమన్ చేతుల మీదుగా బ్లాక్‌బెల్ట్ ప్రదానం చేసినట్లు మాస్టర్ గౌస్ తెలిపారు.

బీజేపీ పాలనలో నిరుద్యోగం పెరిగింది



ఎమ్మెల్యే యెన్నం, ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: మన పాలమూరు జిల్లాను అభివృద్ధి చేసుకోవాలనే ఆశయం కోసం కాంగ్రెస్‌కు ఓటేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో వివిధ సంఘాలకు చెందిన నాయకులు ఆయన సమక్షంలో శనివారం పార్టీలో చేరిన సందర్భంగా మాట్లాడారు. బీజేపీ పాలనలో నిరుద్యోగం పెరిగిందని, అధిక ఖర్చులు పెరిగినట్లు తెలిపారు. పేదరికం కూడా రోజురోజుకు అధికమవుతుందన్నారు. ఉమ్మడి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో రెండు ఎంపీ సీట్లను గెలిపించి రేవంత్‌రెడ్డికి బహుమతిగా ఇద్దామని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌ఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక కూరగాయల మార్కెట్‌లో చిరు వ్యాపారుల వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సమావేశంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి పాల్గొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం తైబజార్ రద్దు చేసినట్లు వివరించారు. జిల్లా కార్యాలయంలో తిమ్మసానిపల్లి బీఆర్‌ఎస్ మహిళా కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. స్థానిక 32వ వార్డు ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో జమైతుల్ ఖురేషి కమిటీ సభ్యులు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు.

వంశీచంద్‌రెడ్డిని ఆశీర్వదించండి



ప్రచారం చేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

చిన్నచింతకుంట: కాంగ్రెస్ పార్టీతోనే దేశం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం చిన్నచింతకుంట మండలం కురుమూర్తి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమానికి ఆమె హాజరై కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. వంశీచంద్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. గ్రామ ఎన్నికల ఇన్‌చార్జ్ బాల్‌రాజు, కథలప్ప, చిన్నకురుమన్న, సహదేవ్‌లతోపాటు పలువురు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మిడ్జిల్: కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని.. ఎన్నికల్లో అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కోరారు. శనివారం రెడ్డిగూడ, చిల్వేర్, అయ్యవారిపల్లి, వెలుగొమ్ముల, కొత్తూర్, మల్లాపూర్ గ్రామాల్లో ప్రచారం సందర్భంగా నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. ఎన్నికల కోడ్ వల్ల కొన్ని పథకాలు అమలు కాలేదని, పూర్తయిన వెంటనే అమలు చేస్తామన్నారు. టీపీసీసీ కార్యదర్శి రబ్బాని, మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలమూరులో ఆర్యవైశ్య అభినందన సభ

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో శనివారం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకమైన కల్వ సుజాత అభినందన సన్మాన సభ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమ కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆర్యవైశ్యులకు అండగా ఉంటుందన్నారు. చైర్మన్ కల్వ సుజాత మాట్లాడుతూ తనకు ఈ పదవి ఇచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. ఆర్యవైశ్య సంక్షేమం, అభివృద్ధియే ధ్యేయంగా పనిచేస్తామని తెలిపారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు ఎదిరె ప్రమోద్‌కుమార్, మిర్యాల వేణుగోపాల్, కొండ చక్రధర్‌గుప్త, సూర్యనారాయణ, సాయికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ఓటు వేయడం వృథా



దేవరకద్ర: మన బతుకులు బాగు పడాలంటే చల్లా వంశీచంద్‌రెడ్డికే ఓటు వేయాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కోరారు. మంగళవారం గూరకొండ, గోప్లాపూర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. పాలమూర్ రంగారెడ్డి, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల గురించి పట్టించుకోని బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఇక బీఆర్‌ఎస్ వారికి ఓటు వేయడం వృథా అన్నారు. టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్ కుమార్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి పాల్గొన్నారు.

చిన్నచింతకుంట/దేవరకద్ర: దమగ్నాపూరం, చిన్నచింతకుంట, కురుమూర్తిస్వామి ఆలయ ప్రాంగణంలో, దేవరకద్రలో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకున్న అనంతరం ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. కురుమూర్తిలో స్వామికి వారికి ప్రత్యేకపూజలు చేశారు. అక్కడ 53 కిలోల భారీకేక్ కట్‌చేశారు.

దేవరకద్రలోని పార్టీ కార్యాలయంలో మండల నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యేను కలిసి ఘనంగా సన్మానించారు.

హిస్టరీ అధ్యాపకుడికి డాక్టరేట్



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగాధిపతి శ్రీపాద గంగాధర్‌కు ఏపీలోని శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ (తిరుపతి) పీహెచ్‌డీ ప్రదానం చేసింది. ఈ అధ్యాపకుడు ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్ రెడ్డి పర్యవేక్షణలో ‘హిస్టారికల్ స్టడీ ఆఫ్ గద్వాల సంస్థానం’పై పరిశోధన చేశారు. దీంతో డాక్టరేట్ దక్కగా శనివారం ఈయనను కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.విజయ్‌కుమార్, అధ్యాపక బృందం అభినందించింది. కార్యక్రమంలో అకాడమిక్ కో–ఆర్డినేటర్ సురయ్య జబీన్, అర్థశాస్త్ర విభాగాధిపతి పి.సుధాకర్‌రెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ రాజేశ్వరి, అధ్యాపకులు వాసంతి, రవళి, ఎ.కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి బాబురావ్

బాలానగర్: ఎంపీపీ కమల అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. మీటింగ్‌కు ఎంపీటీసీలు సభ్యులు, కార్యదర్శులు హాజరుకాగా.. ప్రత్యేక అధికారులు దాదాపు ఎవరూ రాలేదు. దీంతో ఎలాంటి చర్చ లేకుండానే మొక్కుబడిగా సమావేశాన్ని ముగించారు. కాగా తిరుమలగిరిలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని ఎంపీటీసీ సభ్యుడు వెంకట్‌రాం నాయక్ అధికారుల తీరుపై మండిపడ్డారు. మరో సభ్యుడు జమీర్, లింగునాయక్ మాట్లాడుతూ నేరెళ్లపల్లిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా జెడ్పీటీసీ కల్యాణి విద్యుత్ బిల్లులు వసూలు చేస్తున్నారని పేర్కొనగా.. ఎలాంటి ఇబ్బంది పెట్టడం లేదని ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. మండల ప్రత్యేక అధికారి బాబురావు ఎన్నికల కోడ్ కారణంగా కొంత సమస్య ఏర్పడిందని ఉన్నత అధికారులకు నివేదించి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శరత్ చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులను అరికట్టాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఫెలోషిప్ ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: క్రైస్తవులపై రోజు రోజుకు దాడులు జరుగుతున్నాయని, వాటిని అరికట్టాలని మహబూబ్‌నగర్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు కోరారు. దాడులకు వ్యతిరేకంగా స్థానిక ఎంబీసీ మైదానంలో శనివారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రంతోపాటు పలు చోట్ల దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఫెలోషిప్ అధ్యక్షుడు ఎస్. యేసుపాదం, కార్యదర్శి సుందర్‌పాల్, కోశాధికారి బీఎస్.పరంజ్యోతి, ఉపాధ్యక్షులు ఎఫ్రాయిం, ఉప కార్యదర్శి పాస్టర్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

ముమ్మరంగా కాంగ్రెస్ ప్రచారం



నంచర్లలో ఇంటింటా ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహమ్మదాబాద్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మండల అధ్యక్షుడు కేఎం నారాయణ తెలిపారు. శనివారం నంచర్ల, చౌదర్‌పల్లి, వెంకట్‌రెడ్డిపల్లి, మహమ్మదాబాద్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాంలాల్, రాములు, రాఘవేదర్‌రెడ్డి, శాంతీబాయి తదితరులు పాల్గొన్నారు.

హన్వాడ: మండలకేంద్రంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనువాసులు, బచ్చన్నగౌడ్, తిరుతయ్యగౌడ్, ఎండీ కలీం, నారాయణ, శేఖర్‌గౌడ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

అడ్డాకుల: పార్లమెంట్ ఎన్నికల్లో యాదవులందరు కాంగ్రెస్‌కు అండగా ఉండాలని మండల యాదవ సంఘం అధ్యక్షుడు భీమన్నయాదవ్ అన్నారు. కాటవరంలో శనివారం సంఘం ముఖ్య నాయకులతో సమావేశమై మాట్లాడారు. గత ప్రభుత్వం యాదవులను విస్మరించిందని ఆరోపించారు. గోవుల బాలరాజు, జగదీష్, నాగరాజు, మల్లియాదవ్, వెంకటేష్, నర్సింహ్మా, బాలస్వామి తదితరులు ఉన్నారు.

రాజాపూర్: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మండల సీనియర్ నాయకులు నరహరి అన్నారు. శనివారం రాయపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు లింగం యాదవ్, శేఖర్‌గౌడ్, గణేష్‌గౌడ్, యాదగిరి, మహిపాల్‌రెడ్డి, ఇస్తరయ్య పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి



ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

భూత్పూర్: బీఆర్‌ఎస్ పార్టీ అధినేత మాజీ సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిందని, ఎంపీగా మళ్లీ మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని నాయకులు అన్నారు. శనివారం ఇంటింటి ప్రచారం చేశారు. కర్వెన మాజీ ఉప సర్పంచ్ బాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ యాదిరెడ్డి, విండో డైరెక్టర్ చిన్నా, మల్లేష్, తదితరులు ఉన్నారు.

జడ్చర్ల టౌన్: బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లు ఏనాడు ఇలాంటి కరువు పరిస్థితులు రాష్ట్రంలో నెలకొనలేదని జెడ్పీవైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య అన్నారు. శనివారం మండలంలోని గొల్లపల్లి, ఈర్లపల్లి, బూర్గుపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సుదర్శన్‌గౌడ్, నాయకులు

కోయిల్‌కొండ: మన్నెశ్రీనివాస్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని మాజీఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మల్కాపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కృష్ణయ్య, భీంరెడ్డి, మల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న తదితరులు జిల్లా కేంద్రంలోని న్యూప్రేమ్‌నగర్‌లో శనివారం బీఆర్‌ఎస్ తరుపున ప్రచారం నిర్వహించారు. రహెమాన్, అనిల్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న బోసుపల్లి ప్రతాప్

మహమ్మదాబాద్: కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని మండల ఎన్నికల ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి తెలిపారు. శనివారం వెంకట్‌రెడ్డిపల్లి, ధర్మాపూర్, సంగాయపల్లి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. శ్రీనివాస్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: బీజేపీ గెలుపే లక్ష్యంగా అందరు కలిసికట్టుగా పని చేయాలని నియోజకవర్గ ప్రబారి బోసుపల్లి ప్రతాప్ కోరారు. శనివారం దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, మండల కమిటీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడోసారి బీజేపీ అధికారంలోకి రాబోతున్నదని మోదీ మరోసారి ప్రధానిగా అవుతారని తెలిపారు. మహబూబ్‌నగర్ ఎంపీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి డీకే అరుణను అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి అందరి కృషి ఎంతో అవసరమన్నారు. ప్రపంచంలోనే భారత దేశానికి ప్రముఖ స్థానం తెచ్చిన మోదీ పాలనను కొనసాగించడానికి ప్రతి కార్యకర్త పని చేయాలని కోరారు. సమావేశంలో మండల నాయకులు కృష్ణంరాజు, దేవన్న, నారాయణరెడ్డి, రాచాలరాజు, నరేష్, నాగిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, కె.విష్ణు తదితరులు పాల్గొన్నారు.